క్లుప్తంగా

నేడు పుల్లంపేటకు ప్రభుత్వవిప్ రాక

పుల్లంపేట : నేడు పుల్లంపేట సచివాలయంలో జరుగనున్న జగనన్న సురక్ష కార్యక్రమానికి రైల్వేకోడూరు శాసనసభ్యులు, ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు హాజరుకానున్నట్లు ఎంపీడీఓ రఘురాం తెలిపారు. ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

శాకంబరి దేవి అలంకరణలో నల్లగంగమ్మ



సంబేపల్లె : మండల కేంద్రంలో వెలసిన నల్లగంగమ్మ ఆదివారం ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. అమ్మవారిని వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరలు, పండ్లతో విశేషంగా అలంకరించారు. వర్షాలు సమృద్ధిగా కురిసి రైతులు, ప్రజలు సుభిక్షంగా ఉండాలన్న ఆకాంక్షతో నల్లగంగమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఎన్జీఓ సంఘం అధ్యక్షుడిగా ఓబులేసు



ఓబులేసును సన్మానిస్తున్న దృశ్యం

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు తాలూకా ఎన్జీఓ సంఘం అధ్యక్షుడిగా ఓబులేసును ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్టు జిల్లా ఎన్జీఓ సంఘం అధ్యక్షుడు శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం పట్టణంలోని ఎన్జీఓ కార్యాలయంలో ఏపీ ఎన్జీఓ అసోసియేషన్, కార్యవర్గ సభ్యులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. జిల్లా కోశాధికారి నిత్యపూజయ్య పర్యవేక్షణలో రైల్వేకోడూరు తాలూకా అధ్యక్ష పదవిని పొలిచర్ల ఓబులేసును ఏకగ్రీవంగా తీర్మానించినట్టు తెలిపారు. ప్రస్తుత సంఘం అధ్యక్షుడు రవీంద్ర వర్మ కార్యదర్శిగా కొనసాగుతారని పేర్కొన్నారు. నూతన కార్యవర్గానికి పలువురు శుభాకాంక్షలు తెలిపారు. ఎన్జీఓ అసోసియేషన్ కార్యదర్శి విజయ్‌కుమార్, కోశాధికారి అస్లామ్, ఉపాధ్యక్షులు గౌరిశంకర్, రవికుమార్, ఉషారాణి, అనుసూయ, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

స్వామి వివేకానందను స్ఫూర్తిగా తీసుకోవాలి

మదనపల్లె సిటీ: విద్యార్థులు స్వామి వివేకానందను స్ఫూర్తిగా తీసుకోవాలని ఏబీవీపీ సీనియర్ నాయకుడు శ్యాంప్రసాద్ అన్నారు. ఆదివారం ప్రశాంత్‌నగర్‌లోని జ్ఞానోదయ పాఠశాలలో ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సం సందర్భంగా సెమినార్ నిర్వహించారు. స్టేట్ వర్కింగ్ కమిటీ సభ్యులు సాయిహితేష్, బాక్ కన్వీనర్ గౌతమ్, రెడ్డిప్రసాద్, కుసుమ, దినేష్ పాల్గొన్నారు.

వచ్చేనెల 13న ఏఐఎస్ఎఫ్ వార్షికోత్సవం

కడప వైఎస్ఆర్ సర్కిల్ : ఆగస్టు 13న ఏఐఎస్ఎఫ్ 88వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించే ఏఐఎస్ఎఫ్ మాజీ నాయకులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర తెలిపారు. ఆదివారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఆయన ఏఐఎస్ఎఫ్ వార్షికోత్సవాన్ని జయప్రదం చేయాలని కోరుతూ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వలరాజు, జిల్లా అధ్యక్షుడు పవన్ తదితరులు పాల్గొన్నారు.

కార్యవర్గం ఎన్నిక

కడప అగ్రికల్చర్ : ఏపీ బీసీ ఓబీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం జోనల్ కార్యదర్శిగా జిల్లాకు సంబంధించి నంద్యాల రాజశేఖర్ జోనల్ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఆదివారం పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరు పట్టణంలో బీసీ, ఓబీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి రాష్ట్రంలోని 26 జిల్లాల బీసీ ఉద్యోగులు, మహిళా ఉద్యోగులు హాజరయ్యారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఇందులో రాయలసీమకు సంబంధించి నంద్యాల రాజశేఖర్‌ను జోనల్ ప్రధాన కార్యదర్శిగా, నాగేషును రాష్ట్ర ఉపాధ్యక్షునిగా, మణిని రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా, వరదయ్యను అన్నమయ్య జిల్లా కార్యవర్గ సభ్యుడిగా, మహాదేవను కార్యవర్గ సభ్యుడిగా ఎన్నుకున్నారు.

శిల్పారామంలో చిన్నారుల సందడి

కడప కల్చరల్ : కడప శిల్పారామంలో ఆదివారం ఆట విడుపు కార్యక్రమంలో భాగంగా సాంస్కృతిక వేదికపై చిన్నారులు తమ ఆటపాటలతో సందడి చేశారు. ఈ సందర్భంగా గాంధీనగర్ మున్సిపల్ హైస్కూలుకు చెందిన విద్యార్థులు పలు జానపద, సినీ గీతాలకు నృత్యాలను ప్రదర్శించారు.

సర్కారీ జాగా.. ప్రైవేట్ పాగా

- యథేచ్ఛగా ఆర్ అండ్ బీ స్థలాల ఆక్రమణ
- అక్రమ నిర్మాణాలు జరిపి బాడుగలకు గదులు
- తీవ్రమవుతున్న ట్రాఫిక్ సమస్య
- నిర్మాణాలు తొలగించి రోడ్డును విస్తరించాలంటూ స్థానికుల విజ్ఞప్తి



ఇరుకుగా మారిపోయిన సౌమ్యనాథలయ రహదారి (ఆర్చి వెనుక వైపు)

రాజంపేట : నందలూరులోని సౌమ్యనాథాలయ రహదారిలో అక్రమ నిర్మాణాలతో రోడ్డు కుదించుకుపోతోంది. సౌమ్యనాథాలయం టీటీడీ విలీనం చేసిన తర్వాత జిల్లా నుంచే కాకుండా ఇతర జిల్లాల నుంచి భక్తుల రాక అధికం కావడంతో అదే స్థాయిలో అంబేడ్కర్ సర్కిల్ (నందలూరు బస్టాండు)లో ట్రాఫిక్ సమస్య జఠిలమైంది. కాగా రైల్వేస్టేషన్‌వైపు ఉన్న రోడ్డు విస్తరణ చేసి, సౌమ్యనాథాలయ వైపు ఉన్న రహదారిని విస్తరణ చేయకుండానే వదిలేశారనే విమర్శలున్నాయి. ఎమ్మెల్యే, ఎంపీపీలు దృష్టి సారించాలని భక్తులు కోరుతున్నారు.

సర్కారీ స్థలాలపై ప్రైవేటు పెత్తనం

బస్టాండ్ నుంచి ఆలయానికి వెళ్లే మార్గంలో ఆర్‌అండ్‌బీ స్థలాలలో పలువురు అక్రమ నిర్మాణాలు చేపట్టారు. వాటికి అద్దె కూడా వసూలు చేస్తున్నారు. స్థలం ప్రభుత్వానిది అయినప్పటికీ దుకాణాల యజమానులు తమ హద్దులు దాటి ముందుకొచ్చి ఏకంగా పర్మనెంట్‌గా షెడ్లు వేసుకున్నారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయానికి గండిపడుతోంది.

అటకెక్కిన సర్వే..

గతంలో ఈ రహదారిలో సర్వే చేపట్టాలని రెవిన్యూ, ఆర్అండ్‌బీ శాఖలు సమాయత్తమయ్యాయి. ఇతర ప్రాంతాల నుంచి సర్వేయర్ల బృందం వచ్చే నీలిపల్లె రోడ్డులో సర్వే చేసి ఆ తర్వాత కనిపించకుండా పోయారు. బస్టాండు ప్రాంతంలోనూ సర్వే చేస్తారని అందరూ ఎదురు చూసినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. సర్వే చేయించాలని నాగిరెడ్డిపల్లె సర్పంచ్ జంబు సూర్యనారాయణ ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేశారు.

ఆక్రమణలతో ట్రాఫిక్..

నందలూరు ఆర్చి నుంచి ఆలయం వైపు ఉన్న రహదారిలో చాలా మటుకు ఆర్అండ్‌బీ రోడ్డు కుదించుకుపోయింది. స్థలం ఆక్రమణపాలైంది. వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తున్నాయి. ఓ వైపు ఆటోలు, పల్లె బస్సులుతో రహదారి ట్రాఫిక్ సమస్య అధికమవుతోంది. శనివారం రోజైతే మరింత ట్రాఫిక్ ఏర్పడుతోంది. వాహనాలు ఆర్చిను ఢీకొన్న సంఘటనలు అనేకం ఉన్నాయి. ఇరుకు రోడ్డు కావడంతో ట్రాఫిక్ అస్తవ్యస్తంగా తయారైంది.

ఆక్రమణలపై వినతులు ఇస్తూనే ఉన్నాం



నందలూరు – టంగుటూరు రహదారిలో రోడ్డు ఆక్రమణలపై వినతులు ఇస్తూనే ఉన్నాం. మండలస్థాయి అధికారుల నుంచి ఆర్డీఓ వరకు వినతులు సమర్పించాం. ఇది వరకు సర్వే జరిగింది. కొన్ని కారణాల వల్ల ఆగిపోయింది. అంబేడ్కర్ సర్కిల్ అభివృద్ధిపై ఎంపీపీ విజయభాస్కర్‌రెడ్డి దృష్టి సారించారు. ఇప్పటికే ప్రయాణీకులకు సులభ్ క్లాంపెక్స్ నిర్మిచారు. పోలీసులకు సబ్ కంట్రోల్ రూం నిర్మించాలి.

–జంబు సూర్యనారాయణ, సర్పంచ్, నాగిరెడ్డిపల్లె

ఇరుకురోడ్డుతో ఇబ్బందులు



నాగిరెడ్డపల్లె అర్బన్ పరిధిలో నందలూరు ఆర్చి వద్ద ట్రాఫిక్ సమస్య అధికంగా ఉంది. దినదినాభివృద్ధి చెందుతున్న సౌమ్యనాథాలయం వల్ల ఈ రహదారి నిత్యం రద్దీగానే ఉంటోంది. రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. ఆటోలు, బస్సులు, లారీ వచ్చేపోయే విధంగా మార్గం లేకపోవడమే ఇందుకు కారణం. ఆర్చి నుంచి రోడ్డు విస్తరణ చేపట్టి ట్రాఫిక్ సమస్య పరిష్కరించేలా ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లాం.

–అర్ముగం విశ్వనాథ్, వైఎస్సార్‌సీపీ నేత, నందలూరు

పరీక్షా కేంద్రాలకు ముందుగానే చేరుకోవాలి

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం పరిధిలో సోమవారం నిర్వహించే డిగ్రీ పరీక్షకు విద్యార్థులు నిర్దేశించిన సమయంలోపు చేరుకోవాలని పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎస్. ఈశ్వరరెడ్డి తెలిపారు. సోమవారం కడప నగరంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పర్యటిస్తున్న నేపథ్యంలో పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ నియంత్రించే అవకాశం ఉందన్నారు. విద్యార్థులు నిర్ణీత సమయం కన్నా ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు.

ఎగ్జిబిషన్ టెండర్లను రద్దు చేయాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : నగర పాలక సంస్థ ఆదాయానికి గండికొట్టే ఎగ్జిబిషన్ టెండర్లను రద్దు చేయాలని సీపీఐ నగర సహాయ కార్యదర్శి కేసీ బాదుల్లా డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎగ్జిబిషన్ టెండర్లలో పాల్గొన్న ఇద్దరు కాంట్రాక్టర్లు సిండికేట్ అయి గత సంవత్సరం టెండర్‌లో రూ.21 లక్షలు చెల్లిస్తే ఈ ఏడాది రూ.15 లక్షలకు తగ్గించి టెండర్లను నిర్వహించడం కాంట్రాక్టర్లకు లబ్ధి చేకూర్చే విధంగా ఉందన్నారు. నగరపాలక సంస్థ అధికారులు కాంట్రాక్టర్‌కు టెండర్ అగ్రిమెంట్ ఇవ్వకపోయినా గ్రౌండ్‌ను ఆక్రమించి ఎగ్జిబిషన్ సామగ్రిని దింపడం అధికారుల అలసత్వానికి నిదర్శమన్నారు. కలెక్టర్ జోక్యం చేసుకొని నగరపాలక సంస్థ ఆదాయం పెంచేందుకు ఉన్న వనరులపై దృష్టి పెట్టాలన్నారు.

యోగాతో ధీర్ఘకాలిక వ్యాధులు నయం



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఆసుపత్రి సిబ్బంది

పీలేరు రూరల్: ఆధునిక అలోపతి వైద్యానికి శాస్త్రీయ యోగా కలబోత అనే ధోరణితో గుప్తా ఆసుపత్రిలో యోగా కన్సల్టేషన్ ప్రారంభించినట్లు యోగా థెరఫి డాక్టర్ పీవీఎస్ లక్ష్మి అన్నారు. ఆదివారం స్థానిక గుప్తా ఆసుపత్రిలో పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దీర్ఘకాలిక జబ్బులను తగ్గించడానికి యోగా సెంటర్లను ప్రారంభించడం జరిగిందన్నారు. అధిక బరువు, రక్తపోటు, మధుమేహము, హార్మోనల్ ఇన్‌బ్యాలెన్స్ రుతు గర్భం సంబంధిత సమస్యలు, థైరాయిడ్ వంటి జబ్బులకు యోగాలో చక్కటి ఆసనాలు, ప్రాణాయామాలు ఉన్నాయన్నారు. గుప్తా ఆసుపత్రిలో ప్రతి సోమ, మంగళవారాల్లో ఉదయం 11 నుంచి 12 గంటల వరకు యోగాథెరఫి అందుబాటులో ఉంటుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు మమతా లక్ష్మి, శ్రీనివాసులు, సలహాదారులు రాయల్ సుధాకర్, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



మొక్కలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

పీలేరు : పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఇంటింటికీ మొక్కలు పంపిణీ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రస్తుతం పచ్చదనం తగ్గిపోవడంతో వాతావరణంలో మార్పులు వచ్చి విపరీతమైన వేడి వస్తోందని తెలిపారు. విరివిగా మొక్కలు పెంచడం ద్వారా దీనికి పరిష్కారం లభిస్తుందన్నారు. పీలేరును పచ్చదనంతో నింపడమే లక్ష్యంతో ఇంటింటికీ మొక్కలు ఇవ్వడానికి 15 వేల మొక్కలు గ్రామ వలంటీర్లకు అందజేసినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ తీసుకున్న మొక్కను నాటి సంరక్షించాలని కోరారు. ప్రతి ఏటా ఇంటికో మొక్క చొప్పున పంపిణీ చేస్తామని తెలిపారు. మొక్కలు పెంచేవారికంటే వాటిని నరికే వారు ఎక్కువయ్యారని, మానవ మనుగడకు మొక్కలే ఆధారమన్న విషయం ప్రతి ఒక్కరూ గ్రహించాలన్నారు. కాలుష్య నివారణ, పర్యావరణ పరిరక్షణకు విరివిగా మొక్కలు పెంచాలని పిలుపునిచ్చారు. మొక్కలు స్వచ్ఛమైన గాలి ఇవ్వడం తోపాటు సంవృద్ధిగా వర్షాలు కురుస్తాయని తెలిపారు. గ్రామ వలంటీర్లు ఇంటింటికీ మొక్కలు ఇవ్వడం తోపాటు మొక్కల పెంపకం ఆవశ్యకతపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రత్నశేఖర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ యల్లయ్య, సర్పంచ్‌లు డాక్టర్ హబీబ్‌బాషా, దండు జగన్‌మోహన్‌రెడ్డి, చంద్రారెడ్డి, నాయకులు హుమయూన్, మహితా ఆనంద్, మస్తాన్, రెడ్డిబాషా, ఉదయ్‌కుమార్, చలపతి, అబీద్, శ్రీనాథరెడ్డి, మునీర్, జయపాల్‌రెడ్డి, హరిత, పెద్దోడు, నాగరాజమ్మ, ఫారెస్ట్ అధికారి రామ్లానాయక్ తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియంలో నూతన ఒరవడి

- పాండవగవ్యతో రైతులకు సహకారం
- ఆదర్శంగా నిలుస్తున్న యువ రైతు శ్రీనివాసులు



పాండవగవ్య ద్వారా సాగులో ఉన్న దోస పంట

రైల్వేకోడూరు : రసాయనిక ఎరువులు వాడివాడి భూములు సారవంతం కోల్పోయి నాణ్యమైన పంటలు పండక దిగుబడి రాక రైతులు లబోదిబోమంటున్నారు. ఇటువంటి పరిస్థితిలో రసాయనిక ఎరువులకు స్వస్తి పలికి సేంద్రియ వ్యవసాయం వైపు మొగ్గుచూపడం మొదలెట్టారు. అయితే సేంద్రియ సాగుకు ప్రాధాన్యం పెరిగినా, సాగులో వినియోగించే కషాయాల తయారీ రైతులకు కష్టతరంగా మారింది. దీనిని గుర్తించిన రైల్వేకోడూరు మండలం న్యూ క్రిష్ణానగర్‌కు చెందిన యువరైతు డేగల శ్రీనివాసులు తానే వాటి తయారీకి నడుం బిగించాడు. తక్కువ ధరకు పాండవగవ్యను రైతులకు అందిస్తూ సేంద్రియ సాగుకు తనవంతు సహకారం అందిస్తున్నాడు. శ్రీనివాసులు తయారు చేసిన పాండవ గవ్యను ఏ పంటకైనా స్ప్రేయింగ్ రూపంలో గాని, డ్రిప్ ద్వారా గాని వాడుకోవచ్చని తెలిపారు. దీని తరువాత ఎటువంటి ఎరువులు, మందులు వాడనవసరం లేదన్నారు. ముఖ్యంగా పాలు, ఆవు పంచకం, పేడ, నెయ్యి, పెరుగుతో 10 రోజుల పాటు మురగేసి పైన ఉండే తేటతో పాండవ గవ్యను తయారు చేస్తున్నట్టు ఆయన తెలియజేశారు. 200 లీటర్ల నీటికి ఒక లీటరు పాండవ గవ్యను కలుపుకుని పంటలకు పిచికారీ చేసుకోవడం లేదా డ్రిప్‌లో వదలాలని సూచించారు. 2022 సంవత్సరంలో అనంతరాజుపేట ఉద్యాన పరిశోధనా స్థానంలో నిర్వహించిన రైతు సదస్సులో సేంద్రియ విధానంలో అతి తక్కువ ధరకు పాండవగవ్యను తయారు చేసి రైతులకు అందించి మంచి దిగుబడులు సాధించినందుకుగాను ఉత్తమ రైతు పురస్కారాన్ని శ్రీనివాసులు అందుకున్నారు. ప్రస్తుతం ఆయన పర్యవేక్షణలో రైల్వేకోడూరు, శ్రీకాళహస్తి, రాజంపేట, రేణిగుంట, డోర్నాల ప్రాంతాలలో మామిడి, బొప్పాయి, అరటి, దోస, వంగ, నిమ్మ వంటి పంటలను రైతులు సాగు చేస్తున్నారు. పాండవగవ్య లీటరు రూ.300కు విక్రయిస్తున్నట్టు అవసరమున్న రైతులు 84640 69587ను సంప్రదించాలన్నారు.

సులభరీతిలో గణితం బోధించాలి

కడప ఎడ్యుకేషన్ : గణితాన్ని విద్యార్థులకు సులభరీతిలో బోధించేందుకు గణిత ఉపాధ్యాయులు కృషి చేయాలని గణితఫోరం రాష్ట్ర అధ్యక్షుడు అట్ల నరసింహారెడ్డి సూచించారు. ఆదివారం కడపలోని మున్సిపల్ హైస్కూల్ మెయిన్‌లో గణిత ఉపాధ్యాయుల సమస్యలపై సమావేశం జరిగింది. ఈ సందర్భంగా గణితఫోరం కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నిక స్టేట్ టెక్నికల్ కమిటీ కన్వీనర్ కోనా కిరణ్‌కుమార్‌రెడ్డి, పీవీ సుబ్బారెడ్డిల ఆధ్వర్యంలో జరిగింది. ఇందులో గౌరవాధ్యక్షుడిగా సునీల్‌కుమార్, అధ్యక్షుడిగా సూర్యనారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా మహేశ్వరరెడ్డి, కోశాధికారిగా సంజీవరెడ్డి, ఉపాధ్యక్షులుగా నాగరాజు, కిషోర్, శ్రీనివాసులు, కార్యనిర్వాహక కార్యదర్శిగా నూరుల్లా, అదనపు కార్యదర్శిగా శ్రీనివాసులు, కార్యవర్గ సభ్యులుగా సురేష్‌బాబు, సురేష్, మనోహరయ్య, పోల్‌రెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో పీఎస్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు లెక్కల జమాల్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు వెంకటసుబ్బారెడ్డి, ప్రొద్దుటూరు డివిజన్ అధ్యక్షుడు వెంకటసుబ్బయ్య, జీవీ రమణలతోపాటు పలువురు గణిత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆలయాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు



పెనగలూరు: భక్తులకు దర్శనమిస్తున్న అమ్మవారు



లక్కిరెడ్డిపల్లె: భక్తుల పూజలందుకున్న మారెమ్మ

లక్కిరెడ్డిపల్లె : మండలంలోని అనంతపురం గ్రామంలో వెలసిన గంగమ్మకు ఆదివాలం వేలాది మంది భక్తులు దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజారులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. మొక్కులు ఉన్న భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి తలనీలాలు అర్పించారు.

సిద్దవటం : మండల కేంద్రం శివారులో వెలసిన ఇరుగులమ్మ అమ్మవారికి ఆదివారం ఘనంగా పూజలు నిర్వహించినట్టు ఆలయ పూజారి వెంకటరమణ తెలిపారు. ఈ సందర్భంగా అమ్మవారికి అభిషేకం, అలంకరణ, ఆకుపూజ, కుంకుమార్చన, సహస్రనామార్చన వంటి పూజా కార్యక్రమాలను నిర్వహించామన్నారు. కొందరు భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించగా, మరికొందరు కాయాకార్పూరాలను సమర్పించి తీర్థప్రసాదాలను స్వీకరించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్టు తెలియజేశారు.

చిన్నమండెం : మల్లూరమ్మకు భక్తులు ప్రత్యేక పూజలు జరిపారు. ఆదివారం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. మొక్కుబడులు తీరిన భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించారు.

ముగిసిన ఆలయ వార్షికోత్సవ వేడుకలు

లక్కిరెడ్డిపల్లె : మండలంలోని మద్దిరేవుల గ్రామం వంగగడ్డ రాచపల్లి సమీపంలో వెలసిన మారెమ్మ దేవత ఐదవ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా ముగిశాయి. కుర్నూతలకు చెందిన వెంకటనారాయణ శాస్త్రి ఆధ్వర్యంలో అమ్మవారికి పూజలు జరిపారు. మొక్కులు ఉన్న భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఆలయ కమిటీ నిర్వాహకులు అన్నదానం ఏర్పాటు చేశారు. అన్నమయ్య జిల్లా ఎంపీపీల సంఘం అధ్యక్షుడు సుదర్శన్ రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారికి పూజలు చేయించారు. ఆలయ కమిటీ నిర్వాహకులు ఓబుల సుబ్బారెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, సురేంద్రనాథ్ రెడ్డి, నరసింహారెడ్డి, శంకర్ రెడ్డి, ఉపసర్పంచ్ సంజీవరెడ్డి పాల్గొన్నారు.



సిద్దవటం: పూజలందుకున్న ఇరుగులమ్మ

వైభవంగా గంగమ్మ జాతర

పెనగలూరు : మండలంలోని సింగారెడ్డిపల్లె పంచాయతీ కంబాలకుంట బీసీ కాలనీలో గంగమ్మ జాతర వైభవంగా నిర్వహించారు. శనివారం రాత్రి నుంచి అమ్మవారిని, పోతులరాజులను గ్రామంలో ఊరేగించారు. గ్రామ సరిహద్దు నుంచి ఊరేగింపుగా వస్తుంటే ప్రతి ఇంటివద్ద ముద్దపెట్టుకొని గ్రామస్తులు మొక్కులు తీర్చుకున్నారు. గ్రామమంతా బంధుమిత్రులతో కళకళలాడింది.

ఆసర్ల గంగమ్మకు బోనాలు

గాలివీడు : మండల కేంద్రంలో వెలసిన యేటిగడ్డ ఆసర్ల గంగమ్మకు భక్తులు పెద్ద ఎత్తున బోనాలు నైవేద్యంగా సమర్పించారు. ఆదివారం ఉదయం అమ్మవారిని అలంకరించి శాస్త్రోక్తంగా పూజలు జరిపారు. ఈ సందర్భంగా ఆషాఢ మాసం బోనాలు విశిష్టతను తెలియజేస్తూ గ్రామదేవతలను కొలుస్తూ డప్పువాయిద్యాల నడుమ అమ్మవారికి ఇచ్చే బోనం ఎంతో పవిత్రమైందన్నారు. తద్వారా సకాలంలో వర్షాలు కురిసి రైతాంగం సుభిక్షంగా ఉంటారన్నారు. భక్తులకు అన్నదానం నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు.



గాలివీడు: ప్రత్యేక అలంకరణలో ఆసర్ల గంగమ్మ

15న శని త్రయోదశి పూజలు

కడప కల్చరల్ : గడ్డిబజారులోని శ్రీ కామకోటి కళాంబ సమేత సోమసుందరేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 15న శనిత్రయోదశి పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు చంద్రమౌళి శర్మ, ఈఓ శ్రీధర్ తెలిపారు. శని త్రయోదశిని పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. అందులో భాగంగా ఉదయం 8.30 నుంచి విశేష పూజలు, మధ్యాహ్నం 12.30 గంటలకు అన్నప్రసాద వితరణ ఉంటాయన్నారు.

సమస్యలపై స్పందించకపోతే మరో ఉద్యమం

కడప ఎడ్యుకేషన్ : విద్యారంగ, ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించకపోతే మరో ఉద్యమం తప్పదని ఫ్యాప్టో రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాంసుందర్‌రెడ్డి, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మిరాజా, ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి బాలగంగిరెడ్డిలు అన్నారు. ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య(ఫ్యాప్టో) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆదివారం కడపలోని యూటీఎఫ్ భవన్‌లో ఫ్యాప్టో జిల్లా చైర్మన్ మదన విజయ్‌కుమార్ అధ్యక్షతన జిల్లా సదస్సు జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగులకు జీవన్మరణ సమస్యగా ఉన్న కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. అలాగే ఉద్యోగులకు 11వ పీఆర్‌సీతో పాటు డీఏ బకాయిలను చెల్లించాలన్నారు. ఉపాధ్యాయుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కరువు నేలలో కాసుల పంట

- ఖర్జూరం సాగు సక్సెస్
- లాభాలు గడిస్తున్న రైతు కె.లక్ష్మికర్‌రెడ్డి



విరగ్గాసిన ఖర్జూరపు కాయలు

ములకలచెరువు: కరువుకు మారుపేరుగా నిలిచిన ములకలచెరువు మండలంలో అరబ్ దేశాల్లో పండే ఖర్జూరం పంట విజయవంతమైంది. ఎడారి ప్రాంతాల్లో మాత్రమే పండే ఖర్జూరం పంటను కరువు ప్రాంతం అనుకూలంగా మారిందని ఒక రైతు రుజువు చేశారు. ఇక్కడి ప్రాంతంలో వేరుశనగ, టమాట పంటల వైపు రైతులు ఎక్కువగా మొగ్గుచూపుతారు. మరి కొంత మంది రైతులు ఉద్యానవన పంటలైన దానిమ్మ, బొప్పాయి, నేరుడు పంటలను సాగుచేస్తున్నారు. తరచూ సాగు చేసే పంటల వైపు వెళ్లకుండా ఒక రైతు వినూత్నంగా అరబ్ దేశాల్లో సాగయ్యే పంట వైపు మొగ్గుచూపాడు. ఖర్జూరం పంట సాగుచేసి విజయవంత మయ్యాడు. పంట కోత దిగుబడికి వస్తుండడంతో దిగుబడి అనుకున్నదాని కంటే ఎక్కువగా వస్తోంది. దీంతో అద్భుతమైన ఫలితాలు రాబట్టాడు. ములకలచెరువు మండలం సోంపల్లెకు చెందిన రైతు. కె.లక్ష్మీకర్‌రెడ్డి 2018 ఏడాదిలో ఆరు ఎకరాల్లో ఖర్జూరపు చెట్లు సాగుచేశాడు. ఎకరాకు రూ.4 లక్షల నుంచి రూ. 5 లక్షల వరకు ఖర్చుచేశాడు. రాజస్థాన్ రాష్ట్రం జోద్‌పూర్ నుంచి టిష్యూ కల్చర్ ఖర్జూరపు మొక్కలను తీసుకొచ్చి నాటించాడు.ఆరు ఎకరాల్లో 440 మొక్కలు నాటాడు. ఖర్జూరపు పంటకు ఇక్కడ ఉష్ణోగ్రతలు అనుకూలంగా మారాయి. ఫలితంగా పంట ఆశించిన మేర వియజవంతమైంది. ప్రస్తుతం ఖర్జూరం కాయలు దిగుబడి దశకు వస్తున్నాయి.

ఒక్కో చెట్టుకు 20 నుంచి 30 వరకు గెలలు వస్తాయి. ఒక్కో చెట్టుకు 120 కేజీల కాయలు దిగుబడివచ్చే అవకాశం ఉంది. మార్కెట్‌లో వీటికి ధర ఎక్కువ, డిమాండ్ అధికం.

80 ఏళ్ల వరకు దిగుబడి వచ్చే అవకాశం

ఖర్జూరపు పంట ఒక్కసారి సాగు చేస్తే సుమారు 80 ఏళ్ల వరకు దిగుబడి వస్తాయి. అరబ్ దేశాల్లో పండే ఖర్జూరపు కాయలు ఇక్కడ నేలలో పండుతాయని నిరూపించాడు రైతు. అధిక ఉష్ణోగ్రతలు ఉండే గుజరాత్, రాజస్థాన్ రాష్ట్రాల్లో ఖర్జూరం పంట సాగుతోంది. ప్రస్తుతం కరువు ప్రాంతమైన ములకలచెరువులో కూడా ఎడారి పంట సాగవ్వడం చూస్తుంటే క్కడి ఉష్ణోగ్రతలు అనువుగా ఉన్నట్లు తెలుస్తోంది.

నెలకు ఒక్కసారి నీరు పెడితే చాలు



ఎడారిలో పండే ఖర్జూరం పంటకు నెలకు ఒక్కసారి నీరు అందిస్తే చాలు. అతి తక్కువ నీటితో సాగు చేయొచ్చు. మిగతా పంటల మాదిరిగా ప్రతి రోజూ నీరు అందించాల్సిన అవసరం లేదు. ప్రతి చెట్టుకు కాయలు కాస్తున్నాయి. దిగుబడి ఆశించిన మేర వస్తోంది. నీటి వినియోగం చాలా తక్కువ. చెట్టుకు రోగాలు, వైరస్ లాంటివి పట్టవు.

- కె. లక్ష్మీకర్‌రెడ్డి, రైతు, ములకలచెరువు